# దయ్యాలకనుమ

●

దయ్యాలు వున్నాయా, లేదా అనే చర్చ మానవుడు పుట్టినప్పటినుంచీ సాగుతున్నది. అసలు దయ్యమంటే ఏమిటీ అన్న ప్రశ్న వేరొకటి. దయ్యం అంటూ వుంటే - దానికి నివాస స్థలం ఏదై వుంటుంది ?...

అమ్మో! దయ్యాల కనుమ!...

కాలం తన కళ్ళకు కాటుక పులుముకునేలోపున దయ్యాల కనుమను దాటుకోవాలి!... గౌరీపతి వడివడిగా నడుస్తున్నాడు.

అతను బస్తీనుంచి బయలుదేరేసరికి – దిశాంచలంలో తారాడుతూన్న సంధ్యాదేవి–తళుక్కున మటుమాయమైంది. అతనికి దారి చూపగలుగుతున్నదీ, ధైర్యం చెబుతున్నదీ పశ్చిమ దిగంతంనుంచీ పృథివీతలానికి ప్రతిఫలిస్తున్న అంతిమ కిరణం మాత్రమే!...

గౌరీపతి చేరుకోవలసింది – కమ్మపల్లె. ఆ కమ్మపల్లె ఉన్నది – దయ్యాల కనుమకు ఇవతలగాదు; అవతల!... వచ్చిన చిక్కు అదే!...నిశీథులలో – నరుడు ఒంటరిగా నడయాడరాని చోటు– దయ్యాల కనుమ. పాము పడగ క్రింది కప్పలా ఈ భావనకు గురియైన అతని హృదయం ఆందోళనతో, భయోత్పాతకరమైన శంకతో గిలగిలలాడి పోతున్నది.

అసలు తాను బస్తీకి రాకుండా ఉండవలసింది – వచ్చినా–ప్రొద్దు గూటిలో పడేవేళకే తన చివర అడుగు కమ్మపల్లెలో పడివుండవలసింది. అదీ జరుగలేదు. ఈ రాత్రి బస్తీలోనే గడిపి మరునాటి ఉదయం బయలుదేరడం మంచిది. అయినా–మంచిచెడ్డలతో ఇప్పుడు తనకు పనిలేదు. నిన్నటికీ నేటికీ దయ్యాల కనుములో దయ్యాల సంఖ్య పది

రెట్లు పెరిగిఉన్నా.. ఈ రాత్రికి తాను కమ్మపల్లెలో ఉండపోవడమంటూ జరగదు.

ప్రపంచంలో ఏమూల కేగినా ఎడబాసిపోక, తన మనస్సు నంటిపెట్టుకొని సంచరించే కమ్మనితావి - పార్వతీ రూపధ్యానం. తాను ఉవ్విళ్ళూరుతున్నదీ, జీవితంలో అపదృశ్యమైనదీ అయిన మహదవకాశం తనకు అందిరాబోతుంటే - దారిపొడుగునా దయ్యాల కనుములున్నా తాను చింతించరాదు.

నేతగాడు మగ్గంమీద నల్లదారాలు వేసి గుడ్డ నేసినట్లు చీకటి తన కేశాలను నలుదిక్కులా పఱచుకుంటున్నది. చలిగాలి రొదతో బాటు దారిపొడుగునా కీచురాళ్ళ రొద ప్రారంభమైంది. పైరు పచ్చలు సాధన పంక్తులు కదలాడే సవ్వడులు, అక్కడక్కడ చేలలో నడయాడుతూన్న కర్షక జనుల కేకలు స్పష్టంగా వినవస్తున్నాయి. అమావాస్య రాత్రి!... ఇంకొక ఐదు నిమిషాలు గడిచితే, రెప్పలార్పకుండా రిక్కించి చూచినా, కన్నులు ముకిళించి నడిచినా ఒక్కటే! చీకటి పడేలోపల దయ్యాల కనుమను దాటవచ్చుననే ధైర్యం దిXజారిపోగా, గాఢాంధకారం రాజ్యమేలే దయ్యాల కనుమలోంచి సాగిపోవడానికి కావలసిన గుండె దిటవును కూడదీసుకోవడమే ఇక మిగిలింది. చెదిరిపోతున్న తన ధైర్యంలా చెల్లాచెదరుగా రేగిపోయిన కంకర రాళ్ళతో ఎగుడు దిగుళ్ళుగా వున్న సన్నని బండి బాటలో చకచకా సాగిపోతున్నాడు - గౌరీపతి.

* * *

ఆ పరిసరాలు, ఆ బస్తీ, దయ్యాలకనుమ, కమ్మపల్లె-ఇవన్నీ తనకు అపరిచితాలు. తనకు ఉద్యోగం రాకముందు కమ్మపల్లె తనకు ఎరుకలోనైనా లేదు. స్వగ్రామం ఇక్కడికి కెక్కడో ఉంది. ఉపాధ్యాయ శిక్షణానంతరం ఆర్డరు చేతికి రాగానే - "ఎక్కడ దీ కమ్మపల్లె?" అన్న ప్రశ్న ఉద్భవించింది. కమ్మపల్లె ఉనికి తెలిసిన తరువాత-ఊహించిన దేమిటంటే - ఆ ఊరొకసుమారుపాటి గ్రామం; అక్కడ తనకు అన్ని సౌకర్యాలు అమరగలవు.

...కాని ఊహకు, వాస్తవానికి పొత్తుకుదరడం చాల అరుదు. ఎన్నో మైళ్ళదాటి కమ్మపల్లెలో కాలుమోపిన గౌరీపతికి తెలిసివచ్చిన దేమిటంటే, చిటికెన వ్రేలికంటే చిన్నవ్రేలు లేదు, కమ్మపల్లెకంటే చిన్నపల్లె లేదు - అన్న సంగతి. ఒక బడిపిల్లవాడు ఒకటి మొదలు పదిహేనువరకు అంకెలు చెప్పగల వ్యవధిలోనే కమ్మపల్లెలోని ఇళ్ళనన్నిటినీ ఇట్టే లెక్కబెట్టవచ్చు. ఆ పల్లెలో పదహారో పూరిల్లు - ఆ పూరి ప్రాథమిక పాఠశాల. ఆ పాఠశాలలో ప్రప్రథమంగా నియుక్తుడైన ఏకోపాధ్యాయుడే - గౌరీపతి.

కమ్మపల్లెకు ఒక ప్రాచీన నామముంది. అది—"ఒంటిల్లు." మూడు తరాల క్రిందట ఒక్కటే ఇంటితో ప్రారంభమైన వంశవృక్షం.

ఈనాడు పదిహేను శాఖలతో అలరారుతున్నది. ఆ పదిహేను కుటుంబాలలోని వారందరూ ఒక్క ఇంటివారే.

తన ఊహలో జరిగిన మరొక పొరబాటు తన సౌకర్యాల విషయం. తన బట్టలు తానే ఉతుకుకోవడం, తనకు

తానే క్షురకర్మ చేసుకోవడం, తన బువ్వ తానే వండుకోవడం మొదలయిన స్వయంకర్మలు గాంధీ మహాత్ముని వంటి నిరాడంబరునికి తప్ప అన్యుడికి దుస్తరం. కమ్మపల్లెలో వేళకు పాలు దొరకవు. డబ్బిచ్చికొనబోయినా ఒక వస్తువు లభించదు. చాకలి మంగలి అందుబాటులో ఉండరు. కోరికను త్యజించి, మనస్సును అదుపులో ఉంచుకుంటే – ఈ అవసరాలకు అతీతంగా ఉండిపోవచ్చు; కాకపోయినా, నాలుగుమైళ్ళ దూరంలో కామితార్థాల నన్నిటినీ ఈడేర్చగల బస్తీ ఒకటి ఉండనే ఉంది. కానీ అతిముఖ్యమైన అవసరం– నిలువ నీడ? ...దీనికి కూడా ఆ బస్తీయే శరణ్యమయ్యే పక్షంలో – తన ఉద్యోగం 'రోజుకు ఎనిమిదిమైళ్ళ నడక' అవుతుందేగాని, విద్యాబోధన కానేరదు.

దిక్కులేనివాని పాలిట దేవుడున్నా డంటారు. క్రొత్తలో ఒకటి రెండురోజులు రామినాయుడి ఇంట భోజనం, బడిలో నిద్రగా గడిచిపోయాయి. చుట్టుప్రక్కల ఉన్న రెండు మూడు పల్లెలుకూడా తన కొరకు ఇంటిని ప్రసాదింపలేకపోయాయి. ఆతపబాధకు సైపలేక అలమటించే బాటసారికి తాత్కాలిక రక్షణగా మేఘమాల అడ్డు వచ్చినట్లు చిట్టచివరికి రామినాయుడే తన కొరకు దారి చూపగలిగాడు.

గృహప్రాంగణంలో రంగవల్లికలా, పల్లెకు ముంగిటనే పాఠశాల నయనానందంగా కనిపిస్తుంది. పాఠశాలకు ప్రక్కగా వందగజాల దూరంలో సూర్యకిరణం నేల తాకలేనంత గుబురుగా ఉన్న చెఱకుదోట నడుమ రామినాయుడి

పంపుబావి ఉన్నది. ఆ బావిగట్టున పంపుషెడ్డు. ఏకాంత వాసానికి ఆ షెడ్డు అయోగ్యంగా మాత్రం లేదు. ఉపాధ్యాయుడికోసం గ్రామస్థులు మరొక ఇల్లు కట్టి ఇచ్చేంత వరకు తాను ఆ షెడ్డులోనే నివాస ముండదలచుకొన్నాడు.

చన్నీటిస్నానం, స్వయంపాకం మున్నగునవి క్రమంగా అలవాటు చేసుకోక తప్పలేదు. ఆంతర్యంగానూ, బాహ్యంగాను తనలో ఉన్న పరిశుభ్రత, పాఠశాలలో తన నిర్దుష్టమైన బోధన, గ్రామస్థులతో తాను ప్రవర్తించే విధానం, పెద్దలపట్ల అవలంబించే అణకువ—ఇవన్నీ క్రమేపీ గ్రామస్థులను ఆకర్షించాయి. పైగా కులంకూడా ఒక్కటే అయినప్పుడు తాను మంచివాడుగా, వారిలో ఒకడుగా అయిపోవడం ఎంతసేపు?

ఒక నియమజీవనానికి అలవాటుపడిన తరువాతనే, కనుమపల్లెను ఆవరించిఉన్న అందాన్ని ఆస్వాదించగల సౌందర్యపిపాస పాదుకుంది తనలో. ప్రకృతి రామణీయకానికి లోటులేని సన్నిధి కనుమపల్లె. పచ్చని చేలు, పచ్చిక బీళ్ళు, పిల్లగాలుల తాకిడికి సిగ్గుతో సంచలించే చెట్టుచేమలు, మందపవనునితో చెట్టపట్టాలు వేసుకుని తేలిపోయే మబ్బుతెరలను ముద్దులాడుతున్న కొండవరుసలు, మామిడి గుబురులలో దాగిన కోయిలమ్మ గొంతుకతో గొంతులు కలుపుతూ, పొలాల్లో పని చేసుకుంటున్న పడుచుపిల్లల పసిమిరూపాలు...దృష్టిని ఏవైపు సారించినా కన్నుల విందుజేస్తూ కనిపిస్తాయి.

అందాన్ని అనుభవించడానికి దోహదకారులు రెండు: ఒకటి—దృష్టి; రెండు—వెలుగు. రాత్రిపూట ఈ రెండ వది నా సికనుక—తూరుపు కొండమీదినుంచి వెలుగు వెల్లువలు పొరలివచ్చేదాక—ఆ సౌందర్యమంతా నిరర్థకం. అంతవరకు పడమటి కొండచాటున శయనించిన దినమణిలా, షెడ్డు గోడలచాటున మరుగు పడిపోవడమే తనకు కర్తవ్యం.

...శ్వాసక్రియకు, సంకల్పానిక్ సంబంధం లేదు. ఊహాలు, భావనను చేయగలవాడికి, ఏకాంతాన్ని గడపడ మనేది శ్వాసక్రియ వంటిదే!...అందుకే ఈ ఏకాంతం కవు లకు, కళాకారులకు పనికివస్తుంది గానీ, ఇతరులకు దుస్స హామే అవుతుంది.

తాను కోలాహలానికీ, సామూహిక జీవనానికి అల వాటు పడ్డాడుగానీ, ఏకాంతానికి అలవాటుపడ లేదు. నిద్రా దేవి కనికరించితే సరే, లేకపోతే ఆ షెడ్డులో కూర్చుని జాగ్రదవస్థను గడపడంకంటే, ఒంటికాలితో ముళ్ళమీద నిలబడటం సులభతరం అనిపిస్తుంది.

అయినా, ఏకాంతంనుంచి తీయని తేనె సోనలు తీసి అందించగల మధుర ప్రకరణం ప్రారంభమైంది తన జీవి తంలో. కమ్మపల్లెకు మంచినీటి వసతి శూన్యం. ఆ సమ స్యను తీర్చడానికి ఊళ్లో ఒక్క చేదబావి ఉన్నా చాలు. పాతాళగంగనే పైకి తరలింపగలుగుతున్నాడు గానీ, కమ్మ పల్లెలో ఒక్క నూతినయినా త్రవ్వించలేకపోయాడు నరుడు. ఫలితమేమిటంటే, నిరంతరంగా నీళ్ళుచిమ్మే రామినాయుడి పంపుబావినుండి చంకన కడవతో ఇళ్ళకు నీళ్ళుమోస్తూ,

యువతీ లలామలు నడకలో నాట్యాన్నీ, కదలికలో కొంగ్రొత్త వయ్యారాలను ప్రోదిచేసుకోవడమే!

...గౌరీపతి నిద్రలేవగానే కంటబడేది ఈ సుందర దృశ్యం!...పంటకాలువలో సుడులుదిరిగే నీటి కలకలమూ, ఆ నీటిలో చేపపిల్లల్లా అందంగా కదులాడే కన్యాహస్తాలను అంటిపెట్టుకొని మ్రోగే కంకణాల గలగలలు, పక్షుల కల కల రవంలా వారి కంఠాలలోనుంచి బహిర్గతమయ్యే తీయని పలుకులు—ఇవన్నీ ప్రొద్దు పొడిచేవేళ గౌరీపతిని మేల్కొలిపే కర్ణపేయమైన కోమల శబ్దాలు!

పొదిలోఉన్న బాణాన్ని ఏ లక్ష్యంవైపుకు కేంద్రీక రించాలో నిర్ణయించేది వేటగాడు గాని, బాణం కాదు. పూల విలుకాడు గౌరీపతి హృదయశరీరాన్ని ఎప్పుడు సంధించి వదలిపెట్టాడో—అది సూటిగా పార్వతి వైపునకే పరుగులు దీసింది.

రామినాయుడి ఇంటి పెరటిలోని రామసీతాఫలాలు తీయడనానికి పెట్టింది పేరు. ఆ రామసీతాఫలం చెట్టుగా రామినాయుడు, ఆ చెట్లో పండిన పండుగా పార్వతి—తన ఊహలో మెదిలి మాయమవుతుంటారు. ఆ మధుర ఫలాన్ని తనకు అంకితం చేసుకోవాలన్న బలీయమైన వాంఛ ఉన్నది కానీ, ప్రయత్నం లేశమాత్రమైనా చేయలేదు తాను. కారణం—తేనెను జుర్రుకోగోరి, తేనెటీగలతో పోరాడగల సాహసం తనకు లేదు. తేనెతెట్టును కదిపినప్పుడు, తరిమి కుట్టే వేళలో ప్రతి తేనెటీగకు భాగముంది. కమ్మపల్లెను, తేనెతెట్టుకు ఈ సామ్యం చక్కగా సరిపోతుంది.

మనిషి రాజకీయరంగంలో పై పైకి పోవడానికి ఎన్ని ఎత్తులు వేయాలో—ప్రణయరంగంలో సాఫల్యం పొందడానికి అన్ని ఎత్తులూ వేయవలసి ఉంది. ఎత్తులు వేయగల కుశాగ్రబుద్ధి కాదు తాను. అందుకే తన ప్రణయం ప్రారంభదశలోనే ఉండిపోయింది.

కొంగు నడుముకు చుట్టి, బిందె చంకనబెట్టి, కుడి పాదాన్ని తీసి ఎడమకు, ఎడమ పాదాన్ని తీసి కుడికి అడుగులు వేసుకుంటూ, చిరుగాలితాకిడికి లేరెమ్మలతో బాటూ అటూ యిటూ ప్రకంపించే లతాంతంలా, చెలుల నడుమ పంపు బావికీ, ఇంటికీ నడుస్తూ ఉంటుంది పార్వతి. పలు మార్లు ఆమె తన చూపులతో చూపులు కలిపినా, మనసుతో మనస్సు జతజేసినదీ లేనిదీ తన కేమి తెలుసు ?... అడిగి తెలుసుకోవాలన్నా, గోపికా బృందాన్ని విడనాడి ఒంటరిగా రావడానికి ఈ మేమీ రాధిక కాదుగదా?

...ఇక తనకు మిగిలినవి కలలు, కలవరింతలు ! తనలో మెదిలో తలపోతలన్నీ తోలు బొమ్మలైతే పార్వతి సూత్రధారిణి... ఒంటరిగా కూర్చున్నప్పుడు వీనుల సోకేది పార్వతి మధురకంఠస్వరమే. కన్నులకు పొడగట్టేది పార్వతి కమనీయరూపమే. మనస్సు ఉవ్విళ్ళూరేది పార్వతితోడి సాంగత్యమే!... ఇంత మధురమైనదా ఏకాంతం!... అందుకేనేమో, పార్వతి తర్వాత తన ప్రేమను ఏకాంతం చూరగొనగలిగింది !!

భూతకాలంలోని చరమ రాత్రికూడా ఆలోచనలకు తియ్యదనాన్ని చిలకరించే ఏకాంతంతోనే గడిచిపోయి

భానూదయమైంది. బాలభానుడు భూతలాన్ని కాంతిసుధలతో నింపినట్లే, తన హృదయకుహరాన్ని ఒక సంతోషవార్త ఆనందసుధలతో నింపింది. ఆ రోజు అమావాస్య ఒక్క ప్రొద్దుగనుక మధ్యాహ్నభోజనానికి తనను చాలమంది గృహస్థులు ఆహ్వానించారు. వారిలో రామినాయుడుకూడా ఒకడు. స్వయంవర మండపంలో రాకుమారి తన ప్రియుని మెడలోనే పూలమాల వేసినట్లు, తాను రామినాయుడి ఇంటికి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. "మొట్టమొదట పిలిచినవాడు రామినాయుడు. సరే ననేశాను. ఆయన కోరికను పాటించడమే న్యాయం. ఔనంటారా? కాదంటారా?..." అని మిగిలినవారికి నచ్చజెప్పాడు.

యజమాని చేతిలో గొలుసు ఉన్నా గింజుకుంటూ ముందుకు లాక్కువెళ్ళే కుక్కపిల్లలా, ఆ మధ్యాహ్నం తనమనస్సు తనను ఈడ్చుకుంటూ రామినాయుడి ఇంటికి పరుగుదీసింది. తనను చూచీ చూడగానే పార్వతి ఒకింత సిగ్గు ఒలకబోసింది. ఆమె ప్రతి చేష్టలోనూ ఏదో ఒక నిగూఢార్థం ధ్వనించింది తనలో.

పార్వతి పీట వేసింది ... 'నా మనస్సామ్రాజ్యానికి అధినాథుడవు నీవు. ఈ పీటాన్ని అలంకరించే హక్కు నీదే !'

ఆమె అరటి ఆకు పరచింది...'నా హృదయదర్పణం చూశావా? ఎంత విశాలమైనదో!...'

ఆకుప్రక్కన మంచినీళ్ళు ఉంచింది...'ఈ దర్పణంలోనికి చూడు...నీవే కనిపిస్తున్నావు...'

కమ్మని వంటకాలు వడ్డించింది...'నా మనస్సులోని ఈ కమ్మదనమంతా ఎన్నాళ్ళు నీ కోసం దాచి పెట్టు కోను?...'

భోజనం ముగించి, చేయి కడుక్కోవడానికి పెరటి లోకి నడిచాడు తాను. నీళ్ళందిస్తూ - "పొద్దుపోయాక ఎక్కడికీ కదలకండి. మీ తో మాట్లాడాలి..." అని గబగబ అనేసి ఇంటిలోనికి వెళ్ళిపోయిన పార్వతి మళ్ళీ కనిపించనే లేదు. తాను నిర్ఘాంతపోయాడు. పార్వతి తనతో మాట లాడడం, ఆ మాటలలో అనురాగం ఒలికించడం మొదలైన సంఘటనలు తనకు స్వప్నరూపంగా సుపరిచితాలు. ఆ కలల్లో ఇదీ ఒకకల కాదు గదా!

తాంబూలం వేసుకుని, రామినాయుడి దగ్గర సెలవు పుచ్చుకొని వలపు తలపుల మత్తుతో అడుగులు వేస్తూ నడుస్తున్నాడు తాను. పండుగ భోజనాలు ముగించి, ఆనందంగా కాలక్షేపం చేయగోరిన కొందరు గ్రామస్థులు తనను బడిదగ్గరే అటకాయించేశారు.

కేవలం కాలహరణే ధ్యేయంగా గలవారికి ఏదీ అన వసర విషయం కాదు. తలాతోకా లేక దొర్లిపోతున్న కబుర్లదొంతరలో చిట్టచివరిని దయ్యాల ప్రసక్తి వచ్చింది.

తనకున్న ఆదర్శాలు ఒకటిగాదు. అధునాతనమైన ఆదర్శాలన్నీ తనవే. దయ్యాలపట్ల నమ్మకం లేనివాడు, "దయ్యమే లేదు" అంటాడు. "అసలు దయ్యమంటే ఏమిటీ?" ఇదీ తన ప్రశ్న.

కానీ—ఎవరి అభిప్రాయాలు వారివి. "ఆయుస్సు తీరక చచ్చినవాడు దయ్యమౌతాడు. ఈ దయ్యాలకు కామరూప విద్య అరచేతిలో ఉసిరికి కాయ వంటిది. వీటి స్వభావం చేతనైనంతవరకు మనుషులకు హానిచేయడం" ఇది ఆ గ్రామీణుల గట్టి నమ్మకం.

ఈ వాద ప్రతివాదాలటుంచి, ఆ చర్చలో తనకు పరిచయమైన క్రొత్త విషయమే దయ్యాలకనుమ. గ్రామస్థుల వివరణప్రకారం—కమ్మపల్లెకు, బస్తీకి నడిత్రోవలో ఉంది దయ్యాలకనుమ. ప్రొద్దుగూకిన పిదప ఆ కనుమలో సంచరించడం ప్రమాదకరం. అక్కడ దయ్యం ఏరూపంలో సాక్షాత్కరిస్తుందో ఎవడూ చెప్పలేడు. ఒకప్పుడు మాయామోహినిగా కనిపించవచ్చు; మరొకవేళ వికృతరూపంతో దర్శనమీయవచ్చు. ఇంకొకమారు అదృశ్యంగా వెన్నాడుతూ మానవుడి ధైర్యాన్ని, అంతకుమించి అతడి ప్రాణాన్ని హరించవచ్చు. దయ్యాలకనుమ దాటుకోవాలేగాని, అటు పిమ్మట పసిపాపకూడా సురక్షితంగా ఇల్లు చేరుకోగలడు.

* * *

ఆ రోజు ఆదివారం.

పట్నవాసంలో పుట్టి పెరగడంచేత వారానికి ఒక్కసారైనా బస్తీకి వెళ్ళి తిరిగి రావడం మనసుకు ఆరోగ్యకరం. సాయంకాలానికల్లా కమ్మపల్లెకు మరలిపోదామనుకున్నాడు గానీ, కాలమంతా స్నేహితులతోనే గడిచిపోయింది.

'పొద్దు పోయాక ఎక్కడికీ కదలకండి. మీతో మాట్లాడాలి...' ఆ మాటలలోని అంతర్యమేమిటీ ?... పార్వతి ఎందుకు వస్తుంది?...ఏం మాట్లాడుతుంది?...రోజుల తరబడి తన గుండెలో గుడి కట్టుకున్న తన ఆరాధ్య దేవత తనకు వరమీయబోతున్నది. తన మనస్సు విప్పి చెప్పుకోవడానికి ఇంతకంటే అవకాశం మరి దొరకదేమో?... మనోహారిని చేరుకోవడానికి మనస్సు తొందర పెడుతున్నా, మనోవేగాన్ని అందుకోవడం కష్టంగానే ఉంది గౌరీపతికి. అంధకారమే గాకుండా, బాటలో అడుగడుగునా ఎదురయ్యే మలుపులు అతన్ని అటకాయిస్తున్నవి. చీకటి కడుపులో కలిసిపోయిన బండి బాటలో, కొండరాళ్ళ నడుమ రాతి పలుకులను తొక్కుకుంటూ, ముళ్ళ డొంకల నడుమ ముళ్ళ కంపలను రాచుకుంటూ,కన్నుల్లో వత్తులు వేసుకుని అగమ్యగోచరంగా నడుస్తున్నాడు ... కాటుక రాసిబోసినట్లున్న గుట్టల అంచున ఎక్కడో ఒకటి రెండు చుక్కలు భీత వదనాలతో గ్రుడ్డిగా మెరుస్తున్నాయి. నిప్పు కళికలు ఎగుర వేసినట్లు మిణుగురు పురుగులు పొదలచుట్టూ నృత్యం సల్పుతున్నాయి. హేమంత కన్య శిశిర హస్తాలతో శరీరానికి చక్కిలిగింతలు పెడుతున్నది.

దయ్యాల కనుమ సమీపించింది. గౌరీపతి గుండె నిండుకు గిలి ఆవరించుకుంటున్నది...కమ్మపల్లెను, బస్తీకి నడుమ కనుమ ఒకటుందని తెలుసుగాని, దానిపేరు దయ్యాల కనుమ అని నేటివరకు తెలియదు తనకు. నిశీధినిలో ఒకటి రెండుసార్లు తాసీ దారిలో ఒంటరిగా నడిచివున్నాడు...ఏ

విధమైన అపాయమూ సంభవించని మాట అటుంచి, దయ్యాల కనుమ సంగతి అప్పటికి తనకు అవిదితం. కాని, ఇప్పుడు, తెలిసి ఆ దారిలో ఎలా నడవడం ?

నిస్సహాయమైనట్టి, గత్యంతరం లేనట్టి స్థితిలో మానవుడి వ్యూహా వీచికలు బహు విచిత్ర గతిలో పయనిస్తాయి. ఇప్పుడున్నట్లుండి తెల్లవారి పోరాదూ?... లేక ...కనుమూసి తెరిచే లోపున తాను తన షెడ్డులో ఉండిపోరాదూ? పోనీ, లాంతర్లూ, బడితెకర్రలూ పట్టుకుని కమ్మపల్లెనుంచి ఓ పదిమంది తనకోసం ఎదురు రాకూడదూ? ఇలా ఉన్నాయి గౌరీపతి ఆలోచనలు.

ప్రక్కన చింత చెట్లో గుడ్లగూబ గుబ గుబలాడుతున్నది. దూరంగా చెరకు తోటల్లో గుంటనక్కలు ఊళ పెడుతున్నాయి... గౌరీపతి గుండె గుభిల్లుమంది... వెనుక ఎవరో నడిచివస్తూన్న చప్పుడు !...తిరిగి చూచే ధైర్యం లేకపోయింది... చెవులు రిక్కించాడు గౌరీపతి అలికిడి లేదు. మరికొంతసేపటికి... మళ్ళీ సవ్వడి...అది...అది...దయ్యమేనా ?...

సిగ్గుచేటు!... అది తన చెప్పుల చప్పుడు!...

...దారికి కుడి ఎడమలలో నిలబడి తలలూపుతున్న నల్లని చెట్లు, పొదలూ అతనికి దయ్యాలులా కనిపిస్తున్నాయి... అదిగో! అదేమిటి?... దయ్యం!...కదలక మెదలక తనవైపేచూస్తున్నది... అరరే!...ఏమిటీ మాయ?... కనుపించదేం?...అంతలో ఏమైంది?... ఈ కనుమలో

ఎక్కడో ఒకచోటదయ్యంతనకు తారసపడుతుంది. వికృతంగా నవ్వుతూ మీదికి వస్తుంది... లేక వెనకనుంచి వచ్చి తన పెద్దచేత్తో వీపుమీద ఒక్కచరుపు చరుస్తుందేమో?... ఏమౌతుందో?... గుండెదడతో బాటు కాళ్ళు తడబడుతున్నాయి. చీమ చిటుకుమన్నా ఉలికిపడుతూ, ఆకు అల్లాడినా తిరిగిచూస్తూ నడుస్తున్నాడు గౌరీపతి. భయభ్రాంతులతో ఆతని మెదడు దిమ్మెరపోయింది.

దయ్యాల కనుమ వెనుకబడిపోయింది. ఈ సంగతి తెలియగానే—అతనికి చాలా ఆశ్చర్యం వేసింది. "ఇక పరవాలేదు. ప్రమాదం ఉండదు" అనుకున్నా, దెయ్యాలను గూర్చిన భయానక భావాలు మాత్రం మెదడును పెనవేసుకుని వుండిపోయాయి.

అతనిబుద్ధి పార్వతినిగూర్చి ఆలోచించడం మానివేసింది. సురక్షితంగా పెద్దు చేసుకున్న తర్వాత కదా ఆ సంగతి! కమ్మపల్లె దగ్గరకాగానే అతని ఆనందానికి అంతులేదు. అయినా, పెడ్డుతలుపుతీసి లోపల గడియ పెట్టుకునేంతవరకు జారిపోయిన తన గుండె యథాస్థానంలోనికి రాదు.

బాటవిడిచి, చీకటిలో తారాడుతూ, ముళ్ళ కంచెను చిటపట త్రొక్కుకుంటూ, రామినాయుడి చెరకుతోటలోనికి ప్రవేశించాడు గౌరీపతి. గనిమమీద నడవడం త్రాటిమీద నడిచినట్లుంది. పది బారలదూరంలో పెడ్డు మసకగా కనిపిస్తున్నది....ఉన్నట్టుండి చెరకు మోసుల నడుమ సరసరమంటూ చప్పుడుబయలుదేరింది. గుండెలు దడదడలాడుతుండగా, గౌరీపతి తక్కువ ఆగిపోయాడు. కొన్ని క్షణాల

తర్వాత ఆ చప్పుడు ఆగిపోయి, అల్లంత దూరంలో ఒక భయంకరాకారం అతని ముందు నిలబడింది. తల విరియ బోసుకుని, చీకటికి ఏలికలా ఉన్న ఆ ఆకారం – కదలక మెదలక అలాగే నిలబడిపోయింది. గౌరీపతి శక్తినంతా కూడ దీసుకుని గట్టిగా అరవబోయాడు. ఆ అరుపు గొంతుకలోనే అణగిపోయింది. తుఫానులో ఉవ్వెత్తున పైకిలేచి, లేచిన చోటనే విరిగి పడిపోయే కడలి కెరటంలా నిలబడినచోటనే కుప్పగా ఒరిగిపోయాడు గౌరీపతి.

* * *

ఇది జరిగిన మూడోనాటికి గానీ అతనికి స్పృహ రాలేకపోయింది... తాను రామినాయుడి ఇంట్లో ఉన్నాడు. పార్వతి తనకు సపర్యలు చేస్తున్నది. ఎంతటి అదృష్టం...

ఎవ్వరూ లేని సమయంలో పార్వతి అనురాగంతో అతని తల తడుముతూ ఇలా అన్నది: "నా పాలిట దేవుడు న్నాడు. నువ్వు కళ్ళు తెరిచేంతవరకు నా మనసు మనసులో లేదు."

"పార్వతీ! నేను చూస్తున్నది నిన్నేనా? నేను వింటున్నది నీ మాటలేనా?... ఇది నిజమా? కలా?" అన్నాడు తన జ్ఞానేంద్రియాలను నమ్మలేని గౌరీపతి.

"నువ్వింతే! కలలతోనే కాలం గడుపుతావుగానీ, కలను నిజం చేసుకునే ప్రయత్నమే చెయ్యవు. ఒకవైపు నాకు పెళ్ళి ప్రయత్నాలు జరుగుతుంటే, నువ్వు బెల్లం కొట్టిన రాయిలా పూరుకుంటున్నావు. ఆడదాన్నయినా నేనే

మొదట సాహసించవలసి వచ్చింది. ఆ రోజు, అమావాస్య నాడు, అమ్మ ఊరికెళ్ళింది. నాన్న పంటకుప్పదగ్గర కాపలాకు వెళ్ళితే, ఆ రాత్రి ఇంట్లో తమ్ముడు తప్ప మరెవ్వరూ ఉండరు కదా, అన్ని సంగతులూ నీతో చెప్పాలనుకున్నాను. నువ్వు కలగజేసుకుంటే, ఇంట్లో వెన్న పెట్టుకుని నేతికోసం ఎందుకు పరిగెడతారు మా వాళ్ళు?"

"ఔను పార్వతీ! నీ మనస్సు అర్థంకాని పాఠ్య పుస్తకమైతే, నేను మొద్దబ్బాయినై పోయాను. దాన్ని సులభగ్రాహ్యం చేసుకోవడంలో కొంత ఆలస్యమే జరిగింది. ఆ రోజు నువ్వు మాట్లాడాలి, ఉండమన్నావు. పని ఉండి బస్తీకి వెళ్ళి తిరిగి వచ్చేసరికే, చాలా రాత్రి అయిపోయింది. అంతలో ఈ ప్రమాదం జరిగిపోయింది... అబ్బ! ఊహించుకో లేకుండా ఉన్నాను..." గౌరీపతి ఆ వికృతాకారాన్ని జ్ఞప్తికి తెచ్చుకోడానికి ప్రయత్నించాడు.

"ఔను! ఏమిటో చిత్రంగా ఉంది! నేను నీకోసం పెద్దు దగ్గరకి వచ్చాను... నువ్వు లేవు. చీకట్లో ఎవరో నిలబడి ఉండడం, తరువాత కిందికి జరిగిపోవడం మసగ్గా కనిపించింది. దగ్గరికి వచ్చి చూస్తే నువ్వు!... ఏమైనా రాత్రి పూట అలా ఒంటరిగా తిరగడం మంచిదికాదు..." అంది పార్వతి.

గౌరీపతి ఆశ్చర్యం చెప్పనలవిగాదు. తనను జడిపించిన భయంకరాకారానికి, పార్వతికి పోలికలు వెతుక్కుంటూ, ఆమె ముఖంలోకి తదేకంగా చూస్తూ ఉండిపోయాడు-అతడు.

* * *

రెండు నెలల తరువాత – ఒకనాడు గౌరీపతి బస్తీకి వెళ్ళడం తటస్థించింది. ఉద్యోగ మొక్కటే అయితే ఫరవా లేదు, ఇప్పుడతనికి కమ్మపల్లెలో ఇల్లూ-కల్లాలూ, ఉండగా-ఆ రాత్రిని బస్తీలో గడిపివేయడం భావ్యం గాదు.

జాగు అయితే అయిందని మరీ ఆలస్యంగా ఇంటికి బయలుదేరాడు గౌరీపతి. అతడు ఇంటికి చేరేసరికి – మామ గారు పెట్టిన కొత్త చేతి గడియారం పదిగంటలు చూపింది.

"అమ్మయ్య వచ్చేశారా !... ఎందు కింత ఆలస్యం చేశారు?... దోవకూడా మంచిదికాదు. ఇంత రాత్రివేళ- అందునా – ఒంటరిగా!... సాయంకాలమే ఎందుకు రాలేక పోయారు?..." అంటూ ఆత్రుతగా ప్రశ్నించింది పార్వతి.

గౌరీపతి చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు: "పార్వతీ ! ఎందుకా ఆదుర్దా ?... అనుభవ పూర్వకంగా నేను తెలుసుకున్న దేమిటంటే – సృష్టిలో అసలు దయ్య మనేదే ఉంటే – దానికి నివాస స్థలం పిరికివాడి గుండె. దయ్యం, మిత్తవ, తాకిడ మొదలైనవన్నీ భయానికి మారు పేర్లు!... కాకపోతే— దయ్యాల కనుమలో కనిపించని దయ్యం నాకు ఆనాడు నా ప్రియ సఖిలో ఎందుకు కనిపించింది ?..."

—o—

కథా నిలయం
952
శ్రీకాకుళం